
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
సంగారెడ్డి మెదక్
జిల్లాల వార్తలు
సోమవారం 17 జూన్ 2024

## సీనియారిటీ జాబితా కోసం ఎదురుచూపులు

సంగారెడ్డి అర్బన్, జూన్ 16 : స్కూల్ అసిస్టెంట్ బదిలీలకు సంబంధించిన సీనియారిటీ జాబితాను మూడు రోజులుగా జిల్లా అధికారులు వెల్లడించలేదు. దీంతో ఉపాధ్యాయులకు ఎదురుచూపులు తప్పడం లేదు. సాంకేతిక సమస్య కారణంగా సీనియారిటీ జాబితా ప్రకటించడం లేదని విద్యాశాఖ వర్గాలు తెలిపాయి. మరోవైపు ప్రభుత్వ యాజమాన్య పరిధిలోని ఎస్జీటీ టీచర్లకు స్కూల్ అసిస్టెంట్లుగా పదోన్నతి పొందేందుకు సీనియారిటీ, ఖాళీల జాబితాపై అధికారులు కసరత్తు చేస్తున్నారు.



# వారంలో సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ సమావేశం

### సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి

సంగారెడ్డి, జూన్ 16, (ఆంధ్రజ్యోతి): సంగారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ నాయకుల, కార్యకర్తల సమావేశాన్ని మరో వారం రోజుల్లో నిర్వహించనున్నట్టు సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి.జగ్గారెడ్డి తెలిపారు. సమావేశం తేదీ, ఏర్పాట్ల గురించి ఆదివారం సాయంత్రం ఆయన నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి చేర్యాల ఆంజనేయులు, కొండాపూర్‌కు చెందిన పార్టీ ముఖ్య నాయకుడు ప్రభుతో చర్చించారు. పార్లమెంట్ ఎన్నికలు పూర్తయి నెల రోజులు గడిచిందని ఆయన గుర్తు చేశారు. ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలోని సంగారెడ్డి నియోజకవర్గంలో కాంగ్రెస్‌కు ఐదు వేలకు పైగా ఓట్ల మెజారిటీ రావడం సంతోషంగా ఉన్నదని పేర్కొన్నారు. ఎన్నికల్లో మిగిలిన రెండు పార్టీలు కోట్ల రూపాయలు ఖర్చు చేసినా నియోజకవర్గ ప్రజలు కాంగ్రెస్‌నే ఆదరించారని అన్నారు. అందువల్ల నియోజకవర్గ ప్రజలకు, కార్యకర్తలకు మంచి సందేశం ఇవ్వాల్సి ఉందన్నారు. అలాగే, సంగారెడ్డి నియోజకవర్గంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల గురించి ఈ సమావేశంలో వివరించడం జరుగుతుందన్నారు. సమావేశానికి కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో హాజరుకావాలని పిలుపునిచ్చారు. సమావేశం తేదీ, స్థలం త్వరలోనే వెల్లడిస్తామని జగ్గారెడ్డి తెలిపారు.



పగలు వెలవెల.. రాత్రి కళకళ..


పగలు బంద్


రాత్రి నల్లపోచమ్మ జాతర

మెదక్ పట్టణంలో ఆదివారం రెండు భిన్నమైన దృశ్యాలు ఆవిష్కృతమయ్యాయి. శనివారం రాత్రి పట్టణంలో రెండు వర్గాల మధ్య ఘర్షణలు చెలరేగిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో కొన్ని సంఘాలు మెదక్ పట్టణ బంద్‌కు పిలుపునిచ్చాయి. బంద్ కారణంగా ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు దుకాణాలు తెరుచుకోలేదు. భారీగా మోహరించిన పోలీసు బలగాలు పట్టణమంతా పహారా కాశాయి. అయితే, పట్టణంలో రాత్రి నల్లపోచమ్మ జాతర ఉండడంతో ఉత్కంఠ నెలకొన్నది. సాయంత్రం ఊరేగింపునకు వేలాదిగా ప్రజలు తరలివచ్చినా.. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలూ చోటుచేసుకోకుండా ప్రశాంతంగా జరుపుకోవడం విశేషం..

# మెదక్ బంద్ ప్రశాంతం

- పోలీసుల నిఘాలో పట్టణం
- భారీగా బలగాల మోహరింపు
- పర్యవేక్షించిన ఐజీ రంగనాథ్
- తెరుచుకోని దుకాణాలు

మెదక్ అర్బన్, జూన్ 16: మెదక్‌లో బీజేపీ అనుబంధ సంఘాల బంద్ ప్రశాంతంగా ముగిసింది. పట్టణంలో శనివారం రాత్రి ఇరువర్గాల మధ్య ఘర్షణ జరిగిన విషయం తెలిసిందే. దీంతో, పోలీసులు లాఠీచార్జి చేసి పరిస్థితిని అదుపులోకి తెచ్చారు. గొడవ నేపథ్యంలో బీజేపీ, బీజేవైఎం, వీహెచ్‌పీ, భజరంగ్‌దళ్ ఆదివారం పట్టణ బంద్‌కు పిలునిచ్చాయి. దీంతో, వ్యాపార, వాణిజ్య సంస్థలు, హోటళ్లు, పెట్రోల్ బంక్‌లు, దుకాణాలు స్వచ్ఛందంగా మూసివేశారు. ఆర్టీసీ బస్సులు యథావిధిగా నడిచాయి. బస్టాండ్లు, ప్రధాన చౌరస్తాలు, మసీదుల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. బంద్ నేపథ్యంలో ఉన్నతాధికారులు రంగంలోకి దిగారు. మెదక్ జిల్లాతోపాటు, పక్క జిల్లాలైన సంగారెడ్డి, సిద్దిపేట, కామారెడ్డి జిల్లాలకు చెందిన వందలాది పోలీసు బలగాలు తరలించి ప్రధాన కూడళ్లలో మోహరించారు. మల్టీజోన్ ఐజీ ఏవీ రంగనాథ్ స్వయంగా భద్రతను పర్యవేక్షించారు. పట్టణం పూర్తిగా పోలీసుల పహారాలో ఉంది. జిల్లా ఎస్పీ బాలస్వామి పట్టణంలో పెట్రోలింగ్ నిర్వహించారు. పట్టణంలో భారీ బందోబస్తు కొనసాగుతోంది.



మెదక్ ప్రధాన వీధిలో పహారా కాస్తున్న పోలీసులు

## మత ఘర్షణలు ప్రోత్సహిస్తున్న ఎమ్మెల్యే

### బీజేపీ అసెంబ్లీ ఇన్‌చార్జి పంజా విజయ్‌కుమార్


మీడియాతో మాట్లాడుతున్న విజయ్‌కుమార్

మెదక్ అర్బన్, జూన్ 16: గోవులను తరలింపును అడ్డుకున్న బీజేపీ అనుబంధ సంఘాల నేతలపై జరిగిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని, బాధ్యులను వెంటనే అరెస్టు చేయాలని బీజేపీ మెదక్ అసెంబ్లీ ఇన్‌చార్జి, నిజాంపేట జడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. పార్టీ నియోజకవర్గ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. మెదక్‌కు వస్తున్న బీజేపీ ఎమ్మెల్యే రాజాసింగ్‌ను హైదరాబాద్‌లో అరెస్టు చేయడం ప్రభుత్వ పిరికిపంద చర్య అని విమర్శించారు. మెదక్ ఎమ్మెల్యే మత ఘర్షణలను ప్రోత్సహిస్తున్నారని, దాడికి పాల్పడినవారు మైనార్టీలు ఎమ్మెల్యే అనుచరులేనని ఆరోపించారు. ఘటనపై పోలీసులకు సమాచారం ఇస్తే స్పందించలేదని ఆరోపించారు. అరెస్టు చేసిన బీజేపీ జిల్లా, పట్టణ అధ్యక్షులు గడ్డం శ్రీనివాస్, నాయిని ప్రసాద్, నేతలను వెంటనే విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, ఎంపీలు రఘునందన్‌రావు, ఈటల రాజేందర్ పోలీసు ఉన్నతాధికారులతో మాట్లాడారని తెలిపారు.

**సీఎం ఆఫీసును ముట్టడిస్తాం**

మెదక్‌లో జరిగిన ఘటనకు పోలీసు వ్యవస్థ విఫలం కావడమే కారణమని భజరంగ్‌దళ్ రాష్ట్ర కన్వీనర్ శివరాములు పేర్కొన్నారు. పోలీసులు కొందరికి అనుకూలంగా వ్యవహరించారని ఆరోపించారు. బాధ్యులను అరెస్టు చేయకుంటే సీఎం కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. రాత్రి వరకు అరెస్టు చేయకపోతే బంద్‌ను కొనసాగిస్తూ.. రాష్ట్ర బంద్‌కు పిలుపునిస్తామని హెచ్చరించారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చల్లా నరేంద్ర, వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు సత్యానారాయణ, నాయకులు మల్కాజి సత్యనారాయణ, ముక్క సుధాకర్, ఉదయ్, మల్లేశం, అరవింద్‌గౌడ్, శేఖర్ పాల్గొన్నారు.

### దూడలను పట్టుకున్న ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీ కార్యకర్తలు

రామాయంపేట, జూన్ 16 : ఓ వైపు జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలో గోవుల సంరక్షణపై గొడవ చెలరేగిన తరుణంలో.. రామాయంపేటలో బక్రీద్ పండగకు తెచ్చిన రెండు దూడలను ఆర్ఎస్ఎస్, వీహెచ్‌పీవాదులు పట్టుకున్నారు. పట్టణంలో ఆదివారం రాత్రి దూడలను తరలిస్తున్న ఘటన ఉద్రిక్తతలకు దారితీసింది. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటినచేరుకుని ఇరు వర్గాలకు నచ్చజెప్పి శాంతింపజేశారు. దూడలను గోశాలకు తరలించారు.


శాంతి సమావేశంలో మాట్లాడుతున్న ఐజీ రంగనాథ్

## సామరస్యంతో మెలగాలి

### పీస్ కమిటీ సమావేశంలో ఐజీ రంగనాథ్

మెదక్ అర్బన్, జూన్ 16: మెదక్‌లో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణల నేపథ్యంలో ఆదివారం ఐజీ రంగనాథ్ ఆధ్వర్యంలో పట్టణ పెద్దలు నాయకులతో శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఐజీ అన్నివర్గాల వారు శాంతి సామరస్యంతో మెలగాలని సూచించారు. ఏదైనా సమస్య ఉంటే పోలీసుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కారయ్యేలా చూడాలన్నారు. బక్రీద్ పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని కోరారు. సమావేశంలో ఎస్పీ బాలస్వామి, ఏఎస్పీ మహేందర్, మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ చైర్మన్ బట్టి జగపతి, కౌన్సిలర్ లక్ష్మీనారాయణగౌడ్, బీజేపీ జిల్లా నాయకులు నందారెడ్డి, కాశీనాథ్, మైనార్టీ నాయకులు ఖాజామొహినొద్దీన్, జావేద్, మౌలానా, హఫీజ్, అంజద్, ఆఫ్జల్, అహ్మద్‌బేగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా నల్లపోచమ్మ జాతర

### మెదక్‌లో వైభవంగా ఊరేగింపు

మెదక్ కల్చరల్ జూన్ 16 : మెదక్ జిల్లా కేంద్రంలో ప్రతీ సంవత్సరం నిర్వహించే నల్ల పోచమ్మ జాతర ఉత్సవాలు ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఉత్సవాల్లో భాగంగా బండ్ల ఊరేగింపు నిర్వహించారు. అందంగా అలంకరించిన ఎడ్లబండ్లను, ట్రాక్టర్లను పట్టణంలో ఊరేగించి, నల్లపోచమ్మ ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేశారు. జాతరలో వేలాదిగా భక్తులు పాల్గొన్నారు. పట్టణంలో చోటుచేసుకున్న ఘర్షణలు, బంద్ పిలుపు నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు. ఊరేగింపు ప్రశాంతంగా ముగియడంతో పోలీసులు, అధికారులు ఊపిరిపీల్చుకున్నారు.


నల్లపోచమ్మ జాతర ఊరేగింపు

# నులిపురుగులతో అనర్థాలు

20న నులిపురుగుల నివారణ దినం



- ఆరోగ్యవంతమైన జీవితానికి అల్బెండజోల్ మాత్రలు
- 19 ఏళ్లలోపు పిల్లలందరికీ తప్పనిసరి
- సంగారెడ్డి జిల్లాలో 4,05,207 మంది

సంగారెడ్డి అర్బన్, జూన్ 16 : ఆరోగ్యవంతమైన జీవితాన్ని పిల్లలకు అందించడం తల్లిదండ్రుల కర్తవ్యం. భవిష్యత్‌లో పిల్లలు ఆరోగ్యవంతులుగా తయారైతే వారిలో నైపుణ్యాభివృద్ధి పెంపొందుతుంది. అందుకోసం ప్రతీ ఒక్కరు కృషి చేయాల్సిన అవసరం ఉంది. పిల్లల్లో పోషకాహారలోపం, రక్తహీనత తగ్గించడం, శారీరక, మానసిక అభివృద్ధికి తోడ్పాడునందించాలి. ఆరోగ్య సమాజ ఏర్పాటులో భాగంగా ప్రభుత్వం.. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ప్రతీ ఏడాది నులిపురుగుల(నట్టల) నిర్మూలన దినోత్సవాన్ని(ఎన్‌డీడీ-నేషనల్ డివార్మింగ్ డే) నిర్వహిస్తున్నది. ఇందులో భాగంగా ఈ నెల 20న జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఆ రోజు ఏదేనీ కారణం చేత అల్బెండజోల్ మాత్రలు వేయించని పిల్లలకు ఈ నెల 27న కచ్చితంగా వేయించాల్సి ఉంటుంది.

**జిల్లా లక్ష్యం 4,05,207 మంది**

జిల్లావ్యాప్తంగా 1 నుంచి 19 ఏళ్ల లోపు 4,05,207 మంది పిల్లలకు నులిపురుగుల మాత్రలను వేయాలని వైద్యశాఖ లక్ష్యంగా నిర్దేశించుకున్నది. జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, రెసిడెన్షియల్ విద్యాసంస్థలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలందరికీ అల్బెండజోల్ మాత్రలు వేయనున్నారు. జిల్లాలో 1,468 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, 68 ప్రభుత్వ, ప్రైవేటు జూనియర్ కళాశాలలు, 1,505 అంగన్‌వాడీ కేంద్రాలలో ఈ మాత్రలు మింగిస్తారు. ఒకటి నుంచి రెండు సంవత్సరాల పిల్లలకు సగం మాత్ర, 2 నుంచి 3 సంవత్సరాల వయస్సు పిల్లలకు ఒక మాత్ర పొడి చేసి నీళ్లతో తాగిస్తారు. 3 నుంచి 19 ఏళ్ల వయసున్న పిల్లలందరికీ ఒక మాత్రను నమిలి మింగించనున్నారు. నులిపురుగుల మాత్రల పంపిణీలో జిల్లాలోని అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు, ఆశాలను భాగస్వాములను చేస్తున్నారు.

**మూడు రకాల నులిపురుగులు**

పిల్లల్లో సాధారణంగా మూడు రకాల నులిపురుగులు కనబడే అవకాశం ఉంది. ఏలిక పాములు, నులిపురుగుల, కొంకి పురుగులు ఉంటాయి. వీటిని నిర్మూలించేందుకుగాను ఆల్బెండజోల్ మాత్రలు వేసుకోవాల్సి ఉంటుంది.

**అపరిశుభ్రతతోనే**

అపరిశుభ్రతతో నులిపురుగులు పిల్లలకు సంక్రమిస్తాయి. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే నులిపురుగులు వ్యాపిస్తాయి. చేతిగోర్లను శుభ్రంగా ఉంచుకోవాలి. పెరిగిన గోర్లలో మట్టిచేరి అనారోగ్యానికి కారణమవుతారు. బహిరంగ ప్రదేశాల్లో మల విసర్జన వల్ల కూడా నులిపురుగులు శరీరంలోకి ప్రవేశిస్తాయి. భోజనం చేసేటప్పుడు శుభ్రంగా చేతులు కడుక్కోవాలి. కూరగాయలను శుభ్రమైన నీటితో కడగాలి. ఆహార పదార్థాలపై ఎప్పుడు మూతలు కప్పి ఉంచాలి.

**అనేక సమస్యలు**

నులిపురుగులతో పిల్లలకు అనేక అనర్థాలు కలుగుతాయి. వీటి వల్ల శరీరంలో రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, బలహీనత, కడుపునొప్పి, వికారం, విరోచనాలు, బరువు తగ్గడంతో మరిన్నీ ఇబ్బందులు తలెత్తుతాయి. నులిపురుగుల నిర్మూలనతో రక్త హీనత నియంత్రణ పోషకాల గ్రాహ్యతను మెరుగుపర్చే ప్రయోజనాలను పుష్కలంగా కలుగజేస్తుంది.

**మాత్రలు తప్పక వేసుకోవాలి**



సంగారెడ్డి జిల్లాలోని 1 నుంచి 19 ఏళ్ల పిల్లలందరూ నులిపురుగుల నివారణ మాత్రలు అల్బెండజోల్ తప్పనిసరిగా వేసుకోవాలి. 20న నిర్వహించే కార్యక్రమాన్ని ఆయా శాఖల సమన్వయంతో విజయవంతంగా నిర్వహిస్తాం. ఇప్పటికే జిల్లాకు అవసరమైన మాత్రలను సిద్ధం చేశాం. మాత్రల వల్ల ఎలాంటి ప్రమాదం ఉండదు. మాత్రలు వేసుకోవడం ద్వారా చిన్నారుల్లో శారీరక, మానసిక ఎదుగుదల పెరుగుతుంది. రక్తహీనతను నియంత్రిస్తుంది. పోషకాహార ఉపయోగాలను మెరుగుపరుస్తుంది. ఏకాగ్రత, నేర్చుకోగల సామర్థ్యం పెరుగుతుంది. మాత్రల పంపిణీకి అన్ని చర్యలు చేపట్టాం. మాత్రలు వేయించడానికి తల్లిదండ్రులు సమీపంలోని అంగన్‌వాడీ, లేదా పాఠశాల లేదా ఆరోగ్య కేంద్రం సిబ్బందిని సంప్రదించాలి.

-శశాంక్‌దేశ్‌పాండే, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి, సంగారెడ్డి



## కన్నులపండుగగా రామశిలా యాత్ర

- సీతారాముల నామస్మరణతో మార్మోగిన సంగారెడ్డి
- భజనలు, భక్తిగీతాలతో ఊరేగింపు

సంగారెడ్డి రూరల్, జూన్ 16 : జిల్లాకేంద్రంలో ఆదివారం నిర్వహించిన నవాయతన శ్రీరామశిలా శోభాయాత్ర మహోత్సవం కన్నుల పండువగా సాగింది. ప్రకాశం జిల్లా కేఎస్ఆర్ గ్రానైట్స్ నుంచి ప్రారంభమైన యాత్ర ఆదివారం మధ్యాహ్నం సంగారెడ్డికి చేరకుంది. పోతిరెడ్డిపల్లి చౌరస్తాలోని పీఎస్ఆర్ గార్డెన్ నుంచి ప్రధాన రహదారి గుండా కొత్తబస్టాండ్, పాత బస్టాండ్ మీదుగా యాత్ర కొనసాగింది. యాత్రలో వేలాది మంది భక్తులు పాల్గొని భజనలు, భక్తి గీతాలు ఆలపించారు. సీతారాముల నామస్మరణతో సంగారెడ్డి పట్టణం మార్మోగింది. సంప్రదాయ దుస్తులు ధరించి సుహాసినీలు చేసిన నృత్యాలు యాత్రలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. యాత్ర ఎంఎన్ఆర్ చౌరస్తా మీదుగా మండల పరిధిలోని జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆశ్రమానికి చేరుకుంది. ఆశ్రమంలో క్రేన్‌ల సహాయంతో శ్రీరామశిలను ప్రతిష్ఠించిన అనంతరం వేదపండితులు మంత్రోచ్ఛరణలతో గణపతి పూజ, ఉపనిషత్ పారాయణం, మన్యూసూక్త పారాయణం, విశేష గణపతి పూజ తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశ్రమ సభ్యులు సాయి, ప్రశాంత్ కుమార్, తోపాజి అనంతకిషన్, సత్యనారాయణ, నరేష్‌కుమార్, ట్రైబల్‌వెల్ఫేర్ సెక్రటరీ శరత్ తదితరులు పాల్గొన్నారు.




సంగారెడ్డిలో నవాయతన రామశిలా శోభాయాత్ర



# కాజీపల్లి పారిశ్రామిక కాలుష్యంపై ప్రజాపోరాటం

- కాలుష్య తీరుపై సమావేశం
- దశలవారీ ఆందోళనలకు అఖిలపక్ష నాయకుల కార్యాచరణ


సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

జిన్నారం, జూన్ 16: కాజీపల్లి పారిశ్రామికవాడలోని పలు రసాయన పరిశ్రమల కాలుష్యంతో మూడు దశాబ్దాలుగా తీవ్రంగా నష్టపోయామని ఇక జల, వాయు కాలుష్యంపై ప్రత్యక్ష పోరాటాలు చేపడతామని అఖిలపక్ష నాయకులు అన్నారు. ఆదివారం జిన్నారం మండలం కాజీపల్లిలో స్థానిక పరిశ్రమల కాలుష్యం తీరుపై వివిధ పార్టీలు, యువజన సంఘాలు, గ్రామ నాయకుల ఆధ్వర్యంలో పంచాయతీ కార్యాలయం వద్ద సమావేశం నిర్వహించారు. కాజీపల్లికి చెందిన న్యాయవాది దండె రమాకాంత్ ఆధ్వర్యంతో నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఎంపీటీసీ భార్గవ, నాయకులు ఆకుల నవీన్, గద్దె నర్సింహులు, అశోక్, సురేష్, బీమా పాల్గొన్నారు. స్థానిక పరిశ్రమల కాలుష్యంతో మూడు దశాబ్దాలుగా గ్రామ ప్రజలు తీవ్రంగా నష్టపోయారని, జలాశయాలు, పంట పొలాలు కాలుష్యమయంగా మారాయని సమావేశంలో అన్నారు. పర్యావరణ నిబంధనలు పాటించకుండా జల కాలుష్యాన్ని వదిలేస్తూ సహజ వనరులను నాశనం చేశారని, వాయు కాలుష్యం తీవ్రతతో స్థానికులు వివిధరోగాల బారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా స్థానికంగా ఉన్న రసాయన పరిశ్రమలు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ఫార్మాసిటీకి తరలివెళ్లాలని, ఇకపై కాలుష్యాన్ని వెదజల్లే పరిశ్రమలపై ప్రజా పోరాటం చేయాలని సమావేశంలో నిర్ణయించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

# మానవత్వాన్ని చాటుకున్న గోపాల్

చిలప్‌చెడ్, జూన్ 16: పర్సును పోగొట్టుకున్న వ్యక్తి అడ్రస్ కనుక్కుని పర్సు అందజేసిన సంఘటన చిలప్‌చెడ్ మండల కేంద్రంలో చోటు చేసుకున్నది. ఆదివారం అందోల్ మండలం మన్‌సాన్‌పల్లికి చెందిన జెట్ల లక్ష్మీనారాయణకు చెందిన పర్సు చిలప్‌చెడ్ గ్రామానికి చెందిన కుమ్మరి గోపాల్‌కు దొరికింది. ఆ పర్సులో ఉన్న ఆధార్‌కార్డు సహాయంతో బాధితుడి అడ్రస్ తెలుసుకుని ఫోన్‌చేశాడు. సదరు వ్యక్తిది జోగిపేట పట్టణం అని తెలుసుకుని వెళ్లి పర్సును అందజేశాడు. పర్సులో రూ.1000తో పాటు బంగారం ఉంగరం ఉన్నది. ఈ సందర్భంగా గోపాల్‌ను అభినందించారు.

# అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్టు

» విదేశాలకు భారీ వాహనాల ఎగుమతి

» అదుపులోకి తీసుకున్న వరంగల్ పోలీసులు

» 70 లక్షల విలువైన ఐదు కార్లు స్వాధీనం

మట్టెవాడ, జూన్ 16: ఫైనాన్షియర్ల ముసుగులో కార్లు, టిప్పర్లు, జేసీబీ వంటి భారీ వాహనాలను మోసపూరితంగా కొనుగోలు చేసి నెదర్లాండ్, దక్షిణాఫ్రికా, కాంబోడియా వంటి దేశాలకు విక్రయిస్తున్న ముఠాను అరెస్టు చేసినట్లు వరంగల్ సెంట్రల్ జోన్ డీసీపీ అబ్దుల్ బారి తెలిపారు. ఆదివారం వరంగల్ మట్టెవాడ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తురకలకుంట గ్రామానికి చెందిన వరికుప్పల దశరథ్, పెద్దపల్లి జిల్లా పాలకుర్తి మండలం వసంతనగర్ చిన్నదుర్గం సందాన్, రంగారెడ్డి జిల్లా మేడ్చల్ మండలం జగద్గిరిగుట్టకు చెందిన కౌశెట్టి రాకేశ్, హైదరాబాద్ సంతోష్‌నగర్ ఓల్డ్ సిటీకి చెందిన మహ్మద్ జాబీర్‌లు ఈ దందాకు తెరలేపారన్నారు. వీరు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాల్లో... ఆర్థిక ఇబ్బందుల కారణంగా భారీ వాహనాలు అమ్మకానికి పెట్టుకున్న కొంతమంది యజమానుల నుంచి వాహనాలు కొనుగోలు చేసేవారని చెప్పారు. వాటికి సంబంధించిన ఈఎంఐలు తామే కడతామని నమ్మించేవారన్నారు. అలా కొన్న వాహనాలను ఇతరులకు విక్రయించడమో లేక స్క్రాప్ కింద అమ్మడమో చేసేవారని వివరించారు. అలాగే ముంబాయిలోని కొన్ని బృందాల ద్వారా విదేశాలకు ఎగుమతి చేసేవారని డీసీపీ వెల్లడించారు. ముఠా సభ్యులు గతంలో హైదరాబాద్ పోలీసులకు పట్టుబడి సుమారు 16 నెలలు జైలుకు వెళ్లారని, విడుదలయ్యాక కూడా అదే తరహాలో నేరాలకు పాల్పడుతున్నారని స్పష్టం చేశారు. 2023లో వరంగల్, మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ జిల్లాల్లోని పలు ప్రాంతాల్లో సుమారు నాలుగున్నర కోట్ల విలువైన వాహనాలను మోసపూరితంగా తీసుకొని నెదర్లాండ్, సౌతాఆఫ్రికా, కాంబోడియా లాంటి దేశాలకు ఎగుమతి చేశారని తెలిపారు. ఆదివారం తెల్లవారుజామున వరంగల్ హనుమాన్‌జంక్షన్ వద్ద నిందితులను అదుపులోకి తీసుకొని, 5 కార్లను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు.

# 'నాలా' ఎలా?



(మొదటి పేజీ తరువాయి)

చెల్లించాలి. ధరణి రాక ముందు ఆర్డీవో స్థాయిలో వ్యవసాయ భూమిని వ్యవసాయేతర భూమిగా మార్పు చేస్తూ నాలా చార్జీలు వసూలు చేసే వారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో భూముల విలువ ఆధారంగా 5శాతం, జీహెచ్ఎంసీ పరిధిలో 9శాతం చొప్పున తీసుకునేవారు. కానీ, తెలంగాణ ఏర్పాటు తర్వాత ధరణిని తీసుకొచ్చిన అప్పటి ప్రభుత్వం.. నాలా చార్జీలు చెల్లించేందుకు తొలుత ఆప్షన్ ఇవ్వలేదు. ఆ తర్వాత ఇచ్చినా.. ధరణిలో నమోదై ఉండి, ఎకరాలు, గుంటల చొప్పున నమోదై ఉన్న భూములకు మాత్రమే అవకాశం కల్పించింది. అనధికార లేఅవుటల్లో గజాల చొప్పున ఓపెన్ ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసుకున్న వారికి అలాంటి ఆప్షన్ లేకుండా పోయింది. ఉదాహరణకు ఒక ఊరి శివారులో వ్యవసాయ భూమి ఉంటే.. ధరణిలో అది ఫలానా సర్వే నంబర్‌లో ఉందని పేర్కొంటూ దాని విస్తీర్ణం ఎకరాలు, గుంటల్లో ఉంటుంది. ప్రస్తుతం ఇలాంటి భూమిని మాత్రమే వ్యవసాయేతర భూమిగా కన్వర్షన్ చేసుకునే వీలుంది. గతంలోనే లేఅవుట్‌గా మార్చి, సదరు భూమిని గజాల చొప్పున వేర్వేరు వ్యక్తులకు రిజిస్ట్రేషన్ చేసి ఉంటే.. ధరణిలో అది హౌసింగ్ సైట్ అనే పేరుతో చూపిస్తోంది. ఇలాంటి భూమికి నాలా చార్జీలు చెల్లించే అవకాశం లేకుండా పోయింది. దీంతో దశాబ్దాల క్రితం భూములు కొనుగోలు చేసిన వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### ఆప్షన్ లేక సతమతం..

గ్రేటర్ హైదరాబాద్‌తోపాటు శివారు ప్రాంతాల్లో దశాబ్దాల క్రితమే పెద్దఎత్తున అనధికార లేఅవుట్లు వెలిశాయి. వాటిలో ఓపెన్ ప్లాట్లను వేలాది మంది కొనుగోలు చేశారు. ఆయా స్థలాల్లో భవన నిర్మాణ అనుమతులకు వెళ్లిన సందర్భంలో భూమి విలువలో ఎల్ఆర్ఎస్ చార్జీల కింద 30శాతం, నాలా చార్జీల కింద మరికొంత వసూలు చేసే వారు. దీనికితోడు జీహెచ్ఎంసీ పరిధిలోనైతే చేంజ్ ఆఫ్ ల్యాండ్ యూజ్(సీఎల్‌యూ) పేరిట చార్జీలు తీసుకునేవారు. అయితే, తెలంగాణ ఏర్పాటు తర్వాత హెచ్ఎండీఏలో భవన నిర్మాణ అనుమతుల కోసం వెళ్లినప్పుడు కేవలం ఎల్ఆర్ఎస్ చార్జీలు మాత్రమే తీసుకుంటున్నారు. సదరు స్థలానికి నాలా చార్జీలు చెల్లించకపోతే.. ఆ ఫీజు చెల్లించి పత్రాన్ని తీసుకురావాలని సూచిస్తున్నారు. ధరణి వచ్చిన తర్వాత గుంటలు, ఎకరాల్లో ఉన్న భూముల కన్వర్షన్‌కు మాత్రమే ఆప్షన్ ఇచ్చిన ప్రభుత్వం... గజాల్లో ఉన్న స్థలాలకు సంబంధించిన ఆప్షన్ ఇవ్వకపోవడంతో చిన్న, మధ్య తరహా డెవలపర్లు, బిల్డర్లు తీవ్రంగా సతమతమవుతున్నారు. ఈ విషయమై గత ప్రభుత్వాన్ని రియల్ ఎస్టేట్ అసోసియేషన్ల ప్రతినిధులు అనేక మార్లు సంప్రదించినా.. ఫలితం దక్కలేదు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా స్పందించి.. గజాల్లో ఉన్న స్థలాలకూ నాలా చార్జీలు తీసుకొని, భవన నిర్మాణ అనుమతులు ఇప్పించాలని వారు కోరుతున్నారు. దీన్ని అమలు చేస్తే ప్రభుత్వానికి రూ.వెయ్యి కోట్లకుపైగా ఆదాయం వస్తుందని పేర్కొంటున్నారు.

### సమస్యను పరిష్కరించాలి

హైదరాబాద్ శివారు ప్రాంతాల్లోని అనధికార లేఅవుట్లలో భవన నిర్మాణాలు చేపట్టేందుకు పదేళ్లుగా పలువురు డెవలపర్లు, బిల్డర్లు ప్రయత్నం చేస్తున్నారు. కానీ అనుమతులు రాకపోవడంతో ఆయా స్థలాలన్నీ నిరుపయోగంగా మారుతున్నాయి. గత ప్రభుత్వంలో ధరణి తీసుకొచ్చి అదనపు చార్జీలను విధించి ఆదాయాన్ని పొందేందుకు రకరకాల మార్గాలను అప్పటి అధికారులు అన్వేషించారు. కానీ, ఆదాయం వచ్చే మార్గాలను గాలికి వదిలేసి.. ఉన్న చార్జీలను పెంచే ప్రయత్నం చేశారు. కొత్త ప్రభుత్వమైనా స్పందించి రియల్ ఏస్టేట్ రంగానికి గుదిబండగా మారిన నాలా సమస్యను పరిష్కరించాలి.

- ఎం.ప్రేమ్‌కుమార్, వెస్ట్‌జోన్ బిల్డర్స్ అసోసియేషన్ చైర్మన్

## ఏఎఫ్‌సీఎస్‌పై నిరాధార ఆరోపణలు: టీజీఎస్ఆర్టీసీ

హైదరాబాద్, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆటోమేటిక్ ఫేర్ కలెక్షన్ సిస్టం(ఏఎఫ్‌సీఎస్)పై నిరాధార ఆరోపణలు తగదని టీజీఎస్ఆర్టీసీ అధికారులు విజ్ఞప్తి చేశారు. ఉన్నతస్థాయి కమిటీ సిఫారసు మేరకే ఏఎఫ్‌సీఎస్‌ను అమలు చేస్తున్నట్లు ఆదివారం విడుదల చేసిన ఓ ప్రకటనలో తెలిపారు. డిజిటల్ టికెటింగ్ కోసం సాంకేతికను అందిపుచ్చుకునేందుకు కేంద్రం రూ.20.97 కోట్లను విడుదల చేసిందని పేర్కొన్నారు. ఏఎఫ్‌సీఎస్ కోసం 2022 నవంబరు 2న టెండర్ నోటిఫికేషన్ విడుదల చేయగా.. ఇంటెలిజెంట్ టికెట్ యంత్రాల సరఫరా, డిజిటల్ టికెటింగ్ సాఫ్ట్‌వేర్ అభివృద్ధి, నిర్వహణకు కావాల్సిన సర్వర్లు, మ్యాన్‌పవర్‌పై 'చలో మొబిలిటీ'కి బాధ్యతలను అప్పగించాలని కమిటీ ప్రతిపాదించినట్లు వివరించారు. బస్సుల్లో యూపీఐ, డెబిట్/క్రెడిట్ కార్డులతో డిజిటల్ పేమెంట్స్, స్మార్ట్‌కార్డ్స్, మొబైల్ టికెట్స్, మొబైల్ బస్‌పాస్ సౌకర్యం కల్పించేందుకు ఈ వ్యవస్థ దోహదపడుతుందన్నారు. మహాలక్ష్మి పథకం అమలుకు మహిళలకు స్మార్ట్‌కార్డ్ జారీ చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని, ఇందుకు చలో మొబిలిటీ అనుభవం ఉపయోగపడుతుందని గుర్తించామన్నారు. దాంతో మార్చి 15న చలో మొబిలిటీకి లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్ఓఐ) ఇచ్చామని తెలిపారు. కొన్ని డిపోల్లో పైలట్ ప్రాజెక్టుగా అమలు చేస్తామని, అన్ని డిపోల్లో అమలుకు మూడు నెలల సమయం పడుతుందని వివరించారు. అసోం, బిహార్ రాష్ట్రాలతోపాటు.. ముంబై, ఇండోర్, జబల్‌పూర్ నగరాల్లో ఈ వ్యవస్థ కొనసాగుతోందని, ఒక్క ముంబైలోనే చలో మొబిలిటీ ద్వారా 11 లక్షల స్మార్ట్‌లు జారీ అయ్యాయని పేర్కొన్నారు.

## సైబర్ బాధితులకు రూ.31.29 కోట్లు రికవరీ

» టీజీసీఎస్‌బీ డైరెక్టర్ శిఖాగోయల్

హైదరాబాద్, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్ల చేతిలో ఆర్థికంగా మోసపోయిన బాధితులకు రూ.31.29 కోట్ల సొమ్మును రికవరీ చేసినట్లు తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో(టీజీసీఎస్‌బీ) డైరెక్టర్ శిఖాగోయల్ తెలిపారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ (టీఎస్ఎల్ఎస్ఏ), టీజీసీఎస్‌బీ సంయుక్తంగా తీసుకున్న చర్యల వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 20వ తేదీ నుంచి జూన్ 8 వ తేదీ వరకు రెండు లోక్‌అదాలత్‌లతో కలిపి రూ.31.29 కోట్లు రికవరీ చేసినట్లు ఆయన వివరించారు. సైబర్ మోసాలకు సంబంధించి నాలుగునెలల్లోనే కోర్టుల్లో 5,142 పిటిషన్లు నమోదు అయ్యాయని తెలిపారు. సైబర్ నేరాలపై టీజీసీఎస్‌బీ తక్షణమే స్పందిస్తూ బాధితుల సొమ్మును సైబర్ నేరగాళ్ల చేతికి చిక్కకుండా చర్యలు తీసుకుంటున్నదని శిఖాగోయల్ చెప్పారు. సైబర్‌నేరగాళ్లు కొల్లగొట్టిన సొమ్మును బ్యాంకు ఖాతాల్లో ఫ్రీజ్ చేస్తున్నప్పటికీ బాధితులకు తిరిగి అందించడంలో ఆలస్యం అవుతోందని ఆయన అన్నారు. ఇలాంటి కేసులను సీఆర్‌పీసీ సెక్షన్ 457 కింద నమోదు చేయడంతో పాటు దర్యాప్తునకు సంబంధించి స్టాండర్డ్ ప్రొసీజర్ (ఎస్ఓపీ)లను తయారు చేసి అన్ని జిల్లాల ఎస్పీలు, పోలీస్ కమిషనర్లు, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీలకు పంపినట్లు శిఖాగోయల్ తెలిపారు.

## యువకుడి ఉసురుతీసిన.. ఆన్‌లైన్ బెట్టింగ్

» 3 రోజుల క్రితం ఆత్మహత్యాయత్నం.. ఆస్పత్రిలో ఆదివారం మృతి



భాను(ఫైల్)

రామాయంపేట, జూన్ 16: ఆన్‌లైన్ బెట్టింగ్ ఓ యువకుడి ప్రాణాలు తీసింది. ఈ ఘటన మెదక్ జిల్లా రామాయంపేట మండలం దర్మారం గ్రామంలో జరిగింది. గ్రామానికి చెందిన దొమ్మాట భాను(24) డిగ్రీ పూర్తి చేసి డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కొన్ని రోజులుగా ఆన్‌లైన్ బెట్టింగ్‌కు అలవాటుపడి రూ.2 లక్షల దాకా నష్టపోయాడు. దీంతో మనస్తాపం చెంది మూడు రోజుల క్రితం తన వ్యవసాయ పొలం వద్ద పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబీకులు వైద్యం కోసం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రంజిత్ తెలిపారు.

# 164 కిలోల గంజాయి, 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు సీజ్

» వేర్వేరు కేసుల్లో ఏడుగురి అరెస్టు




విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మిక పెరుమాళ్, ఏసీపీ శ్రీనివాసరావు

హైదరాబాద్ సిటీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఒడిసా నుంచి హైదరాబాద్‌కు గుట్టుగా గంజాయి తరలిస్తున్న రెండు అంతర్రాష్ట్ర ముఠాలకు చెందిన ఆరుగురిని హైదరాబాద్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 164 కిలోల గంజాయి, మూడు కార్లు, ఓ బైక్, ఆరు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. టాస్క్‌ఫోర్స్ డీసీపీ రష్మి పెరుమాళ్ సీసీఎస్‌లో ఆదివారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. హుమాయున్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో భారీ మొత్తంలో గంజాయి దిగుమతి అవుతుందనే సమాచారంతో దాడి చేసిన పోలీసులు ఓ ముఠాను పట్టుకుని వారి వద్ద వంద కిలోల గంజాయిని సీజ్ చేశారు. కామారెడ్డి జిల్లా పిట్లాంకు చెందిన ధారావత్ రవి, మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన సయ్యద్ బహదూర్, ఆనంద్ రామ్‌జీ కదమ్‌ను అదుపులోకి తీసుకున్నారు. వీరిలో ప్రధాన నిందితుడు ధారావత్ రవి ఇటీవల ఒడిశా వెళ్లి అక్కడ ఓ రైతు దగ్గర 100 కిలోల గంజాయి కొనుగోలు చేశాడు. దానిని 32 ప్యాకెట్లుగా మార్చి బహదూర్, ఆనంద్ రామ్‌జీ సహకారంతో కారులో హైదరాబాద్‌కి తరలించి పోలీసులకు పట్టుబడాడు. మరో కేసులో ఇదే తరహాలో ఒడిసా నుంచి నగరానికి గంజాయి తీసుకొచ్చిన హైదరాబాద్‌కు చెందిన షేక్ సర్వేజ్, అబ్దుల్ రవూఫ్, మహ్మద్ అన్వర్ అరెస్టయ్యారు. వారి నుంచి 64 కిలోల గంజాయిని చేసుకున్నారు. ఆసిఫ్‌నగర్‌కు చెందిన షేక్ పర్వేజ్ గతంలో రాజమండ్రి జైలులో శిక్ష అనుభవించాడు. ఇటీవల బయటికొచ్చిన పర్వేజ్ ఒడిసా వెళ్లి జైలులో అతనికి పరిచయమైన గంజాయి రైతు దీపక్‌ను కలిశాడు. దీపక్ నుంచి 64 కిలోల గంజాయి తీసుకుని రవూఫ్, అన్వర్‌తో కలిసి హైదరాబాద్‌కు తీసుకొచ్చి పోలీసులకు చిక్కాడు. మరో కేసులో యూపీ నుంచి హైదరాబాద్‌కు గంజాయి చాక్లెట్లు తీసుకొచ్చి విక్రయిస్తున్న వ్యక్తిని శేరిలింగంపల్లి పోలీసులు అరెస్టు చేశారు. అతని వద్ద 1.65 కిలోల గంజాయి చాక్లెట్లు స్వాధీనం చేసుకున్నారు. శంషాబాద్ పరిధిలో పార్టీలు, ఈవెంట్లలో తనిఖీలు చేసిన ఎక్సైజ్ పోలీసులు 8 మత్తు పదార్థాల ప్యాకెట్లను సీజ్ చేశారు.

## వైద్యం వికటించి రోగి మృతి

● చౌటకూర్‌లో ఆర్ఎంపీ నిర్వాకం

● మృతుడి భార్య ఫిర్యాదు.. కేసు నమోదు



బైరు మల్లేశం(ఫైల్)

పుల్‌కల్, జూన్ 16: వైద్యం వికటించి రోగి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం చౌటకూర్‌లో జరిగింది. పుల్కల్ ఎస్ఐ కె.శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఉప్పరిగూడెం గ్రామానికి చెందిన బైరు మల్లేశం(48) అనారోగ్యంతో శనివారం మధ్యాహ్నం చౌటకూర్‌లోని ఆర్ఎంపీ డాక్టర్ వెంకటేశం వద్దకు చికిత్స కోసం వెళ్లాడు. మల్లేశంను పరిశీలించిన ఆర్ఎంపీ ఇంజక్షన్ ఇచ్చాడు. కొద్దిసేపటికే మల్లేశంకు చెమటలు పట్టి, మూత్ర విసర్జన చేసుకుని అపస్మారక స్థితికి చేరుకున్నాడు. పరిస్థితి విషమంగా మారడంతో మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతిచెందాడు. ఆర్ఎంపీ నిర్లక్ష్యం కారణంగానే తన భర్త మృతిచెందాడని భార్య పద్మ ఆదివారం ఉదయం పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ఆర్ఎంపీని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా మృతదేహాన్ని సంగారెడ్డి ప్రభుత్వాస్పత్రికి తరలించగా.. పోస్టుమార్టం నిర్వహించి కుటుంబీకులకు అప్పగించారు. అయితే ఆదివారం ఉప్పరిగూడెంలో మల్లేశం అంత్యక్రియలు జరిగాయి. మృతుడికి భార్య పద్మ, కూతురు, కుమారుడు ఉన్నారు. దళితుడైన మల్లేశం కుటుంబాన్ని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కాంగ్రెస్ మండల సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీటీసీ కలాలి ఈశ్వర్‌గౌడ్ కోరారు.

## తండ్రిపై కుమారుడి దాడి

● చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి

చేర్యాల, జూన్ 16: కుటుంబ కలహాల నేపథ్యంలో ఇటీవల తండ్రిని రోకలి బండతో తనయుడు బాది గాయాలపాలు చేయగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. చేర్యాల మండలం తాడూరు గ్రామానికి చెందిన గిరక సత్తయ్య(45) అతడి కుమారుడు శివకుమార్ మధ్య కుటుంబ విషయంలో రెండురోజుల క్రితం తగాదా జరిగింది. మాటామాటా పెరగడంతో శివకుమార్ తండ్రి సత్తయ్యపై రోకలిబండతో దాడి చేయడంతో తీవ్రగాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో చేర్పించగా.. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబీకులకు అప్పగించారు.

## రైతులకు డబ్బు చెల్లించిన సీడ్స్ ఆర్గనైజర్



రైతులకు చెక్కు అందజేస్తున్న సీడ్స్ ఆర్గనైజర్ మొగిలి

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అక్కన్నపేట, జూన్ 16: అక్కన్నపేట మండల కేంద్రంలో రైతులు సాగుచేసిన వరి విత్తనోత్పత్తి పంటపై 'రాశి సీడ్స్ కంపెనీ భారీ మోసం' అని ఈనెల 16న ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సీడ్స్ ఆర్గనైజర్ స్పందించారు. రాశి సీడ్స్ కంపెనీ రైతులకు చెల్లించాల్సిన డబ్బులను సీడ్స్ ఆర్గనైజర్‌కు ఎప్పుడో చెల్లించామని కంపెనీ ప్రతినిధులు తెలిపారు. కానీ పంట దిగుబడి రాలేదని బాండ్ పేపర్‌పై రాసిచ్చిన విధంగా సీడ్స్ ఆర్గనైజర్ చెల్లించాలని రైతులు పట్టుబట్టారు. ఆదివారం స్పందించిన సీడ్స్ ఆర్గనైజర్ బదనాపురం మొగిలి అక్కన్నపేటలో రైతులతో సమావేశమయ్యారు. నీళ్లు లేక పంటలు ఎండిపోయాయని, అందువల్ల కొంచెం దిగుబడి తక్కువ వచ్చిందని, నీళ్లు బాగా ఉంటే 15 క్వింటాళ్ల పైనే పండుతుందని రైతులకు వివరించారు. ఈ ఏడాది నీళ్లు లేక రైతులకు దిగుబడి తగ్గినా బాండ్ పేపర్‌పై రాసిచ్చిన విధంగా డబ్బులు రైతులకు చెల్లించారు.

# త్యాగానికి ప్రతీక బక్రీద్

● ముస్తాబైన ఈద్గాలు, మసీద్‌లు

● పండుగ సందర్భంగా ప్రజావాణి రద్దు



సంగారెడ్డిలోని ఈద్గాలో మంచినీటి సౌకర్యం

సంగారెడ్డి రూరల్, జూన్ 16: ముస్లింలు జరుపుకునే పండుగల్లో రంజాన్, బక్రీద్ అత్యంత ముఖ్యమైనవి. రంజాన్ పర్వదినాన ముస్లింలు నెలరోజులపాటు ఉపవాస దీక్షలు చేపట్టి భక్తిభావంతో ఐదుసార్లు నమాజ్ చేస్తారు. అయితే త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగ నిలిచిందని చెప్పవచ్చు. బక్రీద్ సందర్భంగా జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి సమీపంలోని కల్పగూర్‌లో గల ఈద్గావద్ద ముస్లిములు నమాజ్ చేసేందుకు మంచినీటి ట్యాప్‌లు, టెంట్లు ఏర్పాట్లు చేశారు. బక్రీద్ పండుగకు ప్రొటోకాల్ ప్రకారం సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, టీజీఐఐసీ చైర్‌పర్సన్, డీసీసీ అధ్యక్షురాలు నిర్మలాజగ్గారెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మీరవి ఇతర ప్రముఖులను ఆహ్వానించామని ఈద్గా కమిటీ ప్రధాన కార్యదర్శి సయ్యద్ జాకీర్ హుస్సేన్ తెలిపారు. ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించేందుకు మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశామన్నారు. ప్రార్థనలకు సుమారు ఐదువేల మంది వరకు వచ్చే అవకాశమున్నదని, ఎవరికీ ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నామని తెలిపారు.

### మెదక్‌లో ముస్తాబైన ఈద్గా, మసీద్‌లు

మెదక్ కల్చరల్, జూన్ 16: బక్రీద్ వేడుకలకు మెదక్ జిల్లా కేంద్రంతో పాటు పలు ప్రాంతాల్లో ఈద్గాలు, మసీద్‌లు ముస్తాబయ్యాయి. పండుగ సందర్భంగా పట్టణ, పరిసర ప్రాంతాల్లో పొట్టేలు, మేకల అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఈద్గా కమిటీ తరఫున జిల్లా కేంద్రంలోని ఈద్గాల వద్ద ఏర్పాట్లు చేశారు. ఉదయం 8.45 గంటలకు నమాజ్ జరుగుతుందని, జామే మసీద్‌లో ఉదయం 9.15 గంటలకు నమాజ్ ఉంటుందని ఈద్గా కమిటీ అధ్యక్షుడు, సంయుక్త కార్యదర్శి ఆరీఫ్, కార్యదర్శి నయీమ్, కోశాధికారి ఏజాజోద్దీన్ తెలిపారు.



ఈద్గాలో ప్రార్థనలు చేసేందుకు ఏర్పాటు చేసిన టెంట్లు

### ప్రశాంతంగా జరిగేలా చూడాలి: కలెక్టర్

మెదక్ అర్బన్, జూన్ 16: నిబంధనల మేరకు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. బక్రీద్ పండుగ సందర్భంగా ఆదివారం కలెక్టరేట్‌లో ఎస్పీ బాలస్వామి, ఏఎస్పీ మహేందర్, మున్సిపల్, పంచాయతీ, రవాణాశాఖ అధికారులతో సమన్వయ సమావేశాన్ని నిర్వహించారు. కలెక్టర్, ఎస్పీ మాట్లాడుతూ.. మెదక్ జిల్లా ప్రశాంతమైన ప్రాంతమని, మత సామరస్యానికి చిహ్నమని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి విజయశేఖర్‌రెడ్డి, జిల్లా రవాణ శాఖాధికారి వెంకటస్వామి పాల్గొన్నారు.

### ముస్లింలకు హరీశ్‌రావు శుభాకాంక్షలు

సిద్దిపేట టౌన్/సిద్దిపేట అగ్రికల్చర్, జూన్ 16: ఈద్-ఆల్-అదా (బక్రీద్) పండుగ పురస్కరించుకుని ముస్లిములకు మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండుగ సోదర భావం, ఐక్యతకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. అల్లా దయతో తెలంగాణ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థిస్తున్నానన్నారు.

### 'ప్రజావాణి' రద్దు

సోమవారం బక్రీద్ పండుగ సెలవు కారణంగా మెదక్ జిల్లాలో, సిద్దిపేట జిల్లాలో జరిగే ప్రజావాణిని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్లు రాహుల్ రాజ్, మనుచౌదరి తెలిపారు. ప్రజలు ఈ విషయాన్ని గమనించి దరఖాస్తులు ఇచ్చేందుకు కలెక్టరేట్ రావొద్దని సూచించారు.

# దేశంలో రాజ్యమేలుతున్న ఫ్యూడల్ వ్యవస్థ

● సన్యాసులు, బాబాల చేతిలో కీలుబొమ్మలుగా ప్రభుత్వాలు

● రాజ్యాంగ ధిక్కారానికి పాల్పడుతున్న కేంద్ర ప్రభుత్వ పెద్దలు

● ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ ఖాసీం




విద్యా సదస్సులో మాట్లాడుతున్న ప్రొఫెసర్ ఖాసీం

గజ్వేల్, జూన్ 16: దేశంలో ఫ్యూడల్ వ్యవస్థ రాజ్యమేలుతుందని ఉస్మానియా యూనివర్సిటీ ప్రొఫెసర్ చింతకింది ఖాసీం అన్నారు. గజ్వేల్ పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఆదివారం ఉపాధ్యాయ దర్శిని మాసపత్రిక సంపాదకుడు ప్రకాశ్‌రావు పదవీ విరమణ సందర్భంగా నిర్వహించిన విద్యాసదస్సులో అరుణోదయ సాంస్కృతిక సమాఖ్య అధ్యక్షురాలు విమలక్కతో కలిసి పాల్గొన్నారు. అనంతరం 'సంక్షోభంలో సామాజిక విలువలు' అనే అంశంపై ప్రసంగించారు. నేటి సమాజంలో మతాన్ని రాజకీయంలోకి తీసుకురావడమే ఫ్యూడల్ వ్యవస్థ అన్నారు. ఫ్యూడల్ వ్యవస్థలో విలువలకు స్థానం ఉండదని, మతాలు, కులాల ప్రాతిపదికన ప్రజలు విచ్ఛిన్నం అవుతారన్నారు. పదేపదే మతాల గురించి ప్రధాని మాట్లాడినా.. స్వయం ప్రతిపత్తి గల ఎన్నికల సంఘం మాట్లాడలేదన్నారు. సన్యాసిలకు కాళ్లు మొక్కుతూ అది విలువగా ప్రచారం చేస్తూ అంతా అనుసరించేలా చేస్తున్నారని, గతంలో రాష్ట్రపతి శంకర్ దయాల్‌శర్మ తిరుపతికి పెళ్లి పొర్లు దండాలు పెట్టేవారని ఆయనను చూసి మిగతా వారు నేర్చుకునేలా ఉండేదన్నారు. సన్యాసులు రాజ్యం నడిపేలా చేస్తున్నారని, పురుషాధిక్య విలువలను ఫ్యూడలిజం పెంచి పోషిస్తున్నదని చెప్పారు. నేటి సమాజంలో చదువు, సంస్కారం పెరిగే కొద్ది బాబాలను పూజించడం తగ్గాలని కానీ అలా తగ్గడం లేదన్నారు. దీంతో సామాజిక విలువలు సంక్షోభంలోకి వెళ్తున్నాయని, దేశ అధినేత దేవుడిపైకి ప్రతి అంశాన్ని నెట్టివేసేలా పనిచేస్తున్నారన్నారు. అలాగే ఉపాధ్యాయులు గతంలో ప్రజా ఉద్యమాల్లో, ప్రజా సమస్యల పరిష్కారంలో ముందు ఉండేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేదన్నారు. కులాన్ని వదిలేసి కింది వర్గంతో మమేకమైన వ్యక్తి ఉపాధ్యాయ దర్శిని మాసపత్రిక సంపాదకుడు ప్రకాశ్‌రావు అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వై.అశోక్‌కుమార్, ప్రధాన కార్యదర్శి నాగిరెడ్డి, పూర్వ అధ్యక్షుడు రాంచంద్రం, పూర్వ ఉపాధ్యక్షుడు తిరుపతి రెడ్డి, శ్రీనివాసులు, కొండల్‌రెడ్డి, హనుమాండ్లు, జిల్లా అధ్యక్షుడు విజయేందర్‌రెడ్డి పాల్గొన్నారు.




గజ్వేల్ విద్యా సదస్సులో పాట పాడుతున్న విమలక్క.

## అవమాన భారంతో కార్మికుడి ఆత్మహత్య

● విధులకు వెళ్లనివ్వకుండా సెక్యూరిటీ అడ్డుకున్నారని మనస్తాపంతో అఘాయిత్యం ● సంగారెడ్డి జిల్లాలో ఘటన



ఆందోళన చేస్తున్న కుటుంబీకులు, గ్రామస్థులు



మహేష్(ఫైల్)

హత్నూర, జూన్ 16: విధులకు హాజరయ్యేందుకు పరిశ్రమలోకి వెళ్లనీయకుండా అడ్డుకుని సెక్యూరిటీ సిబ్బంది అవమానించారనే మనస్తాపంతో ఓ కార్మికుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పరిశ్రమ ఎదుట ఉన్న ఓ విద్యుత్ స్తంభం ఎక్కి విద్యుత్ తీగలను ముట్టుకుని ప్రాణం వదిలాడు. సంగారెడ్డి జిల్లా హత్నూర మండలం ముచ్చర్ల గ్రామ శివారులోని ఎస్‌సీఎల్ విన్ టెక్ పరిశ్రమ వద్ద శనివారం రాత్రి జరిగిన ఈ ఘటనలో చెక్కల మహేష్(30) అనే వ్యక్తి మరణించాడు. బాధిత కుటుంబం, స్థానికుల కథనం ప్రకారం.. హత్నూర మండలం సాదుల్లానగర్‌కు చెందిన మహేష్ కొంతకాలంగా విన్ టెక్ పరిశ్రమలో కాంట్రాక్టు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మహేష్‌కు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అయితే, నైట్ డ్యూటీ కోసం శనివారం రాత్రి పరిశ్రమ వద్దకు చేరుకున్న మహేష్‌ను సెక్యూరిటీ సిబ్బంది, పరిశ్రమ ప్రతినిధులు అడ్డుకున్నారు. మద్యం తాగి వచ్చావని, విధులకు అనుమతించమని చెప్పారు. మహేష్ ద్విచక్రవాహనం తాళాలను కూడా తీసుకుని, పోలీసులను పిలుస్తామని భయపెట్టారు. దీంతో మనస్తాపానికి గురైన మహేష్ పరిశ్రమ ఎదుట ఉన్న విద్యుత్ స్తంభం ఎక్కి 11కేవీ విద్యుత్ తీగలు పట్టుకుని విద్యుదాఘాతానికి గురై చనిపోయాడు. కాగా, మహేష్ మృతదేహంతో అతని కుటుంబసభ్యులు, గ్రామప్రజలు ఆదివారం ఉదయం పరిశ్రమ ఎదుట ఆందోళన చేశారు. మహేష్ మరణానికి బాధ్యత వహిస్తూ పరిశ్రమ యాజమాన్యం అతని కుటుంబానికి నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఘటనా స్థలికి చేరుకున్న పోలీసులు ఆందోళనను విరమింపచేసేందుకు విఫలయత్నం చేశారు. అనంతరం, పోలీసుల సమక్షంలో చర్చలు జరిపిన పరిశ్రమ ప్రతినిధులు మహేష్ కుటుంబానికి రూ.11 లక్షలు పరిహారంగా ఇస్తామని హామీ ఇచ్చారు. మహేష్ మరణంపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

## ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానించిన ఎంపీ



ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని సన్మానిస్తున్న ఎంపీ సురేష్ షెట్కార్

నారాయణఖేడ్, జూన్ 16: రాష్ట్ర నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్ ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. జహీరాబాద్ నియోజకవర్గం నుంచి ఘన విజయంసాధించిన సందర్భంగా సురేష్‌షెట్కార్ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాన్ని అందజేశారు.

## నూతన సీఐగా వెంకట రాజాగౌడ్



రామాయంపేట, జూన్ 16: రామాయంపేట నూతన సీఐగా వెంకట రాజాగౌడ్ ఆదివారం పదవీ బాధ్యతలు చేపట్టారు.. ఇక్కడ పని చేసిన బి.వెంకటేష్ ఐజీ కార్యాలయం మల్టీ జోన్‌కు బదిలీపై వెళ్లారు. దీంతో సంగారెడ్డి జోన్ ఏసీబీ ఎస్‌ఐగా విధులు నిర్వర్తిస్తున్న వెంకటరాజాగౌడ్ రామాయంపేటకు వచ్చారు. గతంలో ఆయన ఉమ్మడి జిల్లా నర్సాపూర్ ఎస్‌ఐగా పనిచేశారు.

# ఎక్సైజ్‌శాఖకు సొంత భవనం కరువు

- రెండేళ్లుగా నర్సాపూర్ అతిథి గృహంలోని రెండు ఇరుకు గదుల్లో నిర్వహణ
- ఒక గదిలో సీఐ.. మరో గదిలో సిబ్బంది, స్వాధీనం చేసుకున్న సామగ్రి
- వివాదంలో కార్యాలయ భవనానికి కేటాయించిన స్థలం

నర్సాపూర్, జూన్ 16: ప్రభుత్వానికి ఆదాయం సమకూర్చే ప్రధాన శాఖల్లో ఒకటైన ఎక్సైజ్‌శాఖ సర్కిల్ కార్యాలయానికి సొంతభవనం కరువైంది. అతిథిగృహంలో చాలీచాలని గదులతో వారి అవస్థలు వర్ణనాతీతం. మొదట్లో ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయంలో పాత తహసీల్ కార్యాలయం వెనుక భాగంలో ఉన్న భవనంలో కొనసాగేది. అయితే ఆ భవనం పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో కూల్చివేశారు. దీంతో రెండేళ్లుగా నీటి పారుదల శాఖ అతిథి గృహంలో కేటాయించిన రెండు గదుల్లోనే నర్సాపూర్ ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం కొనసాగుతున్నది.

### ఒకే గదిలో సిబ్బంది, సామగ్రి

రెండు గదుల్లో ఓ గది ఎక్సైజ్ సీఐ విధుల నిర్వహణకు పోగా, సిబ్బంది ఉండేందుకు మరో గది మాత్రమే ఉంది. సర్కిల్ పరిధిలో సీఐతో పాటు ముగ్గురు ఎస్‌ఐలు, ఇద్దరు హెడ్‌కానిస్టేబుళ్లు, 9 మంది కానిస్టేబుళ్లు, ఇద్దరు జూనియర్ అసిస్టెంట్లు



ఐబీ అతిథిగృహంలో ఎక్సైజ్ కార్యాలయం

ఉన్నారు. వీరంతా కార్యాలయంలోని ఒకే గదిలోనే సర్దుకుని కూర్చోవాల్సిన దుస్థితి. వీరికే సరిపడా స్థలం లేదంటే అదనంగా ఎక్సైజ్ కేసుల్లో స్వాధీనం చేసుకున్న వాహనాలు, మద్యం, కల్లు సీసాలు తదితర సామగ్రి కూడా అదే గదిలో ఉంచాల్సి వస్తుంది. దీంతో వాటి మధ్యనే సిబ్బంది అనేక అవస్థలు పడుతూ విధులు నిర్వహించాల్సివస్తుంది.

### కేటాయించిన స్థలం వివాదాస్పదం

నర్సాపూర్ ఎక్సైజ్ సీఐ కార్యాలయానికి సొంత భవన నిర్మాణం కోసం ఐదేళ్ల క్రితం సబ్‌స్టేషన్ సమీపంలో స్థలం కేటాయించారు. అయితే ఆ స్థలం తమదంటూ కొందరు కోర్టుకు ఆశ్రయించడంతో కేటాయించిన స్థలం ప్రస్తుతం కోర్టు పరిధిలో ఉండటంతో దాని జోలికి ఎవరూ వెళ్లడం లేదు. దీంతో మరో స్థలం కార్యాలయం కోసం కేటాయించాల్సిన అవసరం ఉన్నది. ప్రభుత్వశాఖల్లో కీలకశాఖగా ఉన్న ఎక్సైజ్‌శాఖకు నర్సాపూర్‌లో సొంత భవనం లేకపోవడం విడ్డూరంగా ఉందని పలువురు విమర్శిస్తున్నారు. కనీసం ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వమైనా ఈ విషయంపై దృష్టి సారించాల్సిన అవసరముందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.



సీజ్ చేసిన వాహనాలు, సామగ్రి మధ్యనే విధుల నిర్వహణ

## రెండు బైక్‌లు ఢీ.. దంపతులకు తీవ్ర గాయాలు

వెల్దుర్తి, జూన్ 16: ఎదురెదురుగా రెండు బైకులు ఢీకొని ఇద్దరికి తీవ్ర గాయాలైన సంఘటన మండలంలోని హస్తాల్‌పూర్‌లో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని మనేపల్లి గ్రామానికి చెందిన గొల్ల అశోక్, అఖిల దంపతులు ద్విచక్ర వాహనంపై తూప్రాన్ వైపు బయలుదేరారు. అదే సమయంలో దంతాన్‌పల్లి నుంచి హస్తాల్‌పూర్ వైపు వస్తున్న ద్విచక్రవాహనం ఎదురెదురుగా ఢీ కొన్నాయి. దీంతో అశోక్ దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వారిని చికిత్స నిమిత్తం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్థానిక ఎస్‌ఐ నవతగౌడ్‌ను సంప్రదించగా తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదన్నారు.

## తండ్రితో గొడవ పడిన కొడుకు అదృశ్యం



శివయ్య (ఫైల్)

తూప్రాన్, జూన్ 16: డబ్బుల విషయంలో తండ్రితో గొడవపడిన కొడుకు ఇంట్లోనుంచి వెళ్లిపోయి తిరిగి రాలేదు. ఈ సంఘటన తూప్రాన్ పట్టణంలో చోటు చేసుకుంది. తూప్రాన్ ఎస్‌ఐ శివానందం తెలిపిన వివరాల ప్రకారం.. తూప్రాన్ పట్టణానికి చెందిన దుర్గి శివయ్య(45), లక్ష్మి దంపతులు బీడీకాలనీలో నివాసముంటున్నారు. తండ్రి చంద్రయ్యకు ఇవ్వాల్సిన డబ్బుల విషయంలో గొడవ జరుగుతున్నది. ఈ విషయంలో శివ్వయ్య తీవ్ర మనస్తాపానికి గురవుతున్నట్లు తెలిపారు. 14న రాత్రి ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. శివ్వయ్య కోసం వెతికినప్పటికీ ఆచూకీ లభించకపోవడంతో ఆదివారం సాయంత్రం 6 గంటలకు భార్య లక్ష్మి పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్‌ఐ వివరించారు.

## ప్రభుత్వ భూమిని చదును చేసిన గుర్తుతెలియని వ్యక్తులు



కాజీపల్లిలో భూమిని చదును చేసిన గుర్తు తెలియని వ్యక్తులు

జిన్నారం, జూన్ 16: మండలంలోని కాజీపల్లిలో పేదల ఇంటి స్థలాల కోసం కేటాయించిన ప్రభుత్వభూమిని గుర్తు తెలియని వ్యక్తులు చదును చేశారు. కాజీపల్లి 181 సర్వే నెంబర్‌లో గత ప్రభుత్వం పేదల నివాసాల కోసం స్థలాన్ని కేటాయించింది. ఇప్పటికే ఇక్కడ 50 వరకు నివాసాలను నిర్మించగా ఖాళీగా ఉన్న సుమారు 20 ప్లాట్ల స్థలాన్ని శనివారం గుర్తు తెలియని వ్యక్తులు దున్నేశారు. అక్కడ ఏర్పాటు చేసిన ఇంటి స్థలాల నెంబర్లు చెరిపేసి చదును చేయడంతో స్థానిక పేదలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## జిల్లా ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు
### సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్



సంగారెడ్డి అర్బన్, జూన్ 16: సంగారెడ్డి జిల్లా ప్రజలకు సంగారెడ్డి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు చింతా ప్రభాకర్ బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో త్యాగాల పండుగ బక్రీద్, త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశమని పేర్కొన్నారు. భక్తి భావానికి, విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని ఆకాంక్షించారు.

## మాసాయిపేట పాఠశాలలో పని చేయని సీసీ కెమెరాలు



మాసాయిపేట, జూన్ 16: మండల కేంద్రమైన మాసాయిపేటలో గల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేయకపోవడంతో పాఠశాల ఆవరణ రాత్రి సమయాల్లో ఆకతాయిలకు, మందు బాబులకు అడ్డాగా మారిందనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సీసీ కెమెరాలను ఏర్పాటు చేసిన పాఠశాల సిబ్బంది చైర్మన్ వాటి నిర్వహణను పట్టించుకోకపోవడంతో, కెమెరాలు కేవలం నామమాత్రంగానే ఉన్నాయన్నారు. కెమెరాలను పట్టించుకోవాల్సిన పాఠశాల సిబ్బంది కానీ, పాఠశాల చైర్మన్ అమ్మ ఆదర్శ కమిటీలు కానీ వాటిపై దృష్టి సారించకపోవడంతో పాఠశాల ఆవరణ అసాంఘిక శక్తులకు అడ్డాగా మారింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, బాధ్యులు సీసీ కెమెరాలను సరిచేసి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని గ్రామస్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



# భక్తులతో కిటకిటలాడిన ఏడుపాయల క్షేత్రం



ప్రత్యేక అలంకరణలో అమ్మవారి మూలవిరాట్, దర్శించుకుంటున్న భక్తులు

పాపన్నపేట, జూన్ 16: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం ఏడుపాయల వనదుర్గా మాత ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఆదివారం వారాంతపు సెలవు కావడంతో ఉమ్మడి జిల్లా వాసులతో పాటు ఇతర జిల్లాలైన కరీంనగర్, నిజామాబాద్, జంటనగరాలు, పొరుగు రాష్ట్రాలైనా కర్ణాటక, మహారాష్ట్రల నుంచి భక్తులు తరలివచ్చారు. దీంతో ఆలయ పరిసరాలు దుర్గమ్మ నామస్మరణతో మార్మోగాయి. తెల్లవారుజామున 5.30 గంటలకు అర్చకులు అమ్మవారికి అభిషేకం చేపట్టి సహస్రనామార్చన, కుంకుమార్చన అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. మంజీరా నదిపాయల్లో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం అమ్మవారిని దర్శించుకున్నారు. పలువురు బోనాలు, ఒడిబియ్యం సమర్పించారు. విందు భోజనాలు చేసుకొని తిరుగు ప్రయాణమయ్యారు. భక్తుల రద్దీతో దర్శనానికి గంటల సమయం పట్టింది. పాలకమండలి చైర్మన్ బాలాగౌడ్ ఆధ్వర్యంలో ఆలయ సిబ్బంది ఏర్పాట్లు పర్యవేక్షించారు.

# ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను పెంపొందించుకోవాలి



ఎన్జీవోస్ కాలనీలో నిర్వహించిన నగర సంకీర్తనలో భక్తిగీతాలను ఆలపిస్తున్న కమిటీసభ్యులు, ప్రజలు

జహీరాబాద్, జూన్ 16: నగరసంకీర్తన కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం పట్టణంలోని ఎన్జీవోస్‌కాలని, తదితర ప్రాంతాల్లో నగరసంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నగరసంకీర్తన కమిటీసభ్యులు మాట్లాడుతూ సమాజంలో ప్రజలు సుఖశాంతులతో, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ ఈ కార్యక్రమం చేపట్టినట్టు తెలిపారు. ప్రతీ ఆదివారం జహీరాబాద్‌లోని పలు వీధుల్లో భక్తిగీతాలను ఆలపిస్తూ వీధుల్లో ఊరేగింపు నిర్వహిస్తామన్నారు. ఇందులో భాగంగానే ఆదివారం పట్టణంలోని ఎన్జీవోస్ కాలనీ తదితరప్రాంతాల్లో నగరసంకీర్తన కార్యక్రమం చేపట్టామన్నారు. వారానికి ఓరోజు ఉదయం పూట నిర్వహించే నగరసంకీర్తనలో అందరూ పాల్గొని సమాజంలో ఆధ్యాత్మిక భావాన్ని పెంపొందించేందుకు తోడ్పడాలన్నారు. ఆధ్యాత్మికత భావంతో మానసిక ప్రశాంత కలిగి ఆయురారోగ్యాలతో జీవించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో ప్రజలు, ఉత్సవకమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల యూనిఫామ్‌లు పంపిణీకి సిద్ధం



ఐకేపీ కార్యాలయంలో పంపిణీకి సిద్ధం చేస్తున్న సిబ్బంది

చేగుంట, జూన్ 16: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు యూనిఫామ్‌లను అందించేందుకు ప్రభుత్వం ఆయా మండలాలకు సంబంధించిన మహిళా సమాఖ్య సంఘాలకు కాంట్రాక్టు ఇచ్చిన విషయం తెలిసిందే. మండలంలోని 48 ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు సంబంధించిన యూనిఫామ్‌లు కుట్టడం దాదాపు పూర్తయ్యింది. త్వరగా పూర్తి చేయాలనే ఉద్దేశంతో మహిళా సంఘాల సభ్యులు రాత్రి వేళల్లో సైతం యూనిఫాంలు కుడుతున్నారు. జూన్ 12న పాఠశాలలు ప్రారంభం కాగా కొన్ని పాఠశాలకు యూనిఫామ్‌లు అందించారు. మిగతా పాఠశాలలకు సైతం యూనిఫామ్‌ల పంపిణీకి అధికారులు సిద్ధం చేశారు. ఈ విషయమై చేగుంట ఐకేపీ ఏపీఎం లక్ష్మీనర్సమ్మను సంప్రదించగా మండలంలోని 48పాఠశాలలకు సంబంధించి 5,401 జతల యూనిఫామ్‌లకు గానూ సుమారు 4000కు పైగా పంపిణీకి సిద్ధమయ్యాయన్నారు. వారం రోజుల్లో అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫామ్‌లను అందజేస్తామని ఆమె తెలిపారు.

# ఈద్గా వద్ద ప్రార్థనల కోసం ఏర్పాట్లు పూర్తి



జహీరాబాద్‌లో ఈద్గా వద్ద ప్రార్థనలు చేసేందుకు వీలుగా క్యూలైన్‌లను వేస్తున్న ఈద్గాకమిటీ సభ్యులు

జహీరాబాద్, జూన్ 16: బక్రీద్ పర్వదినం సందర్భంగా జహీరాబాద్ పట్టణంలోని ఈద్గావద్ద ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలను చేసేందుకు వీలుగా ఏర్పాట్లు పూర్తి చేశామని ఈద్గా కమిటీ అధ్యక్షుడు అబ్దుల్ మాజీద్, ప్రధానకార్యదర్శి ఎండీ అయూబ్ తెలిపారు. ఆదివారం వారు స్థానిక విలేకరులతో మాట్లాడుతూ జహీరాబాద్ పట్టణంలో ఆయా పండుగల సమయాల్లో సుమారు 5 నుంచి 8వేల వరకు ముస్లింలు ప్రార్థనలు చేసేందుకు వస్తారన్నారు. సోమవారం బక్రీద్ సందర్భంగా ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేసేందుకు వీలుగా క్యూలైన్లను ఏర్పాటు చేయడంతో పాటు, ఎవరూ ఇబ్బందులు పడకుండా మంచినీరు, తదితర సౌకర్యాలను ఏర్పాటు చేశామన్నారు. ఉదయం 7గంటల నుంచి ప్రార్థనలు ప్రారంభమై 8గంటలకే కార్యక్రమం ముగుస్తుందన్నారు. విలేకరుల సమావేశంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఇనాయత్‌అలీ, అయ్యూబ్, వసీం, అక్బర్, ఫసీయొద్దీన్, మోయిన్ తదితరులు పాల్గొన్నారు.

### ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి: ఎస్‌ఐ

చిన్నశంకరంపేట, జూన్ 16: మండలంలోని ముస్లిం సోదరులు బక్రీద్ పండుగను ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ నారాయణగౌడ్ సూచించారు. ఆదివారం ఏర్పాటు చేసిన ప్రత్యేక సమావేశంలో ఎస్‌ఐ మాట్లాడుతూ జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొన్ని సలహాలు, సూచనలు ముస్లిం మత పెద్దలకు తెలియ జేశారు. సోమవారం బక్రీద్ పండుగ సందర్భంగా మండలంలో ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా పండుగను శాంతియుతంగా జరుపుకోవాలని ఆయన సూచించారు.

### ప్రత్యేక చెత్త వాహనాల ఏర్పాటు

నారాయణఖేడ్, జూన్ 16: బక్రీద్ పండగ సందర్భంగా ఏర్పడే వ్యర్థాలను సేకరించేందుకు నారాయణఖేడ్ మున్సిపాలిటీ పరిధిలో సోమవారం చెత్త సేకరణ కోసం ప్రత్యేకంగా వాహనాలను అందుబాటులో ఉంచుతున్నట్లు మున్సిపల్ చైర్మన్ ఆనంద్ స్వరూప్ షెట్కార్, వైస్‌చైర్మన్ దారం శంకర్ తెలిపారు. పండుగ సందర్భంగా ఆదివారం మున్సిపల్ కార్యాలయంలో ముస్లిం మతపెద్దలతో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ వ్యర్థాలను బయట పారవేయకుండా పాలిథీన్ కవర్లలో వేయాలని సూచించడమే కాకుండా, కవర్లను ప్రతీ ఇంటికి పంపిణీ చేస్తున్నామన్నారు. కాలనీలవారీగా ముస్లిం పాలిథీన్ కవర్లలో వేసిన వ్యర్థాలను చెత్త సేకరణ వాహనాల్లో వేయాలని తెలిపారు. పట్టణ శివార్లలోని ఈద్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు జరుపుకునేందుకు అవసరమైన ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కాలనీలవారీగా వచ్చే ప్రత్యేక చెత్త సేకరణ వాహనాల డ్రైవర్ల మొబైల్ నెంబర్లను వారికి అందించారు.



మున్సిపల్ కార్యాలయంలో ముస్లిం పెద్దలతో మాట్లాడుతున్న చైర్మన్ ఆనంద్‌స్వరూప్ షెట్కార్



అమ్మవారి సన్నిధిలో భక్తులు

## చాముండేశ్వరి ఆలయంలో ప్రత్యేక పూజలు

చిలప్‌చెడ్, జూన్ 16: మండల పరిధిలోని చిట్కుల్ గ్రామ శివారులోని చాముండేశ్వరి మాత ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆదివారం సెలవుదినం కావడంతో హైదరాబాద్, మెదక్, బీదర్ తదితర ప్రాంతాల నుంచి సైతం భక్తులు విచ్చేసి అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి కుంకుమార్చనలు నిర్వహించి ముడుపులు చెల్లించుకున్నారు. కొత్త వాహనదారులు తమ వాహనాలకు పూజలు చేయించుకున్నారు. అనంతరం అమ్మవారి సన్నిదానంలో భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

## గంగభవాని దీవెనతో సుభిక్షంగా ఉండాలి



ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, జూన్ 16: గంగభవాని దీవెనలతో ప్రజలు సుభిక్షంగా ఉండాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని ధర్మారం గ్రామంలోని గంగభవాని ఆలయ 11వ వార్షికోత్సవం సందర్భంగా ఆదివారం సాయంత్రం బోనాల ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే పాల్గొని ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని, ప్రతి ఒక్కరు భక్తిభావం అలవర్చుకోవాలని సూచించారు. ఎమ్మెల్యే వెంట జడ్పీటీసీ రమేష్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ శంకర్‌రెడ్డి, పల్వంచ శేఖర్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## రేపు దత్తాత్రేయ మందిర వార్షికోత్సవం

నారాయణఖేడ్, జూన్ 16: ఖేడ్‌పట్టణంలోని దత్తాత్రేయ ఆలయ ప్రథమ వార్షికోత్సవాన్ని ఈ నెల 18న నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ బాధ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 5 గంటలకు స్వామివారికి రుద్రాభిషేకం, 10 గంటలనుంచి రాత్రి వరకు హోమం, పూర్ణాహుతి, తీర్థప్రసాదాల వితరణ, ఆధ్యాత్మిక ధర్మసభ, తదితర కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## బదిలీల ప్రక్రియ తక్షణమే చేపట్టాలి

- వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యనాథ్

సంగారెడ్డి టౌన్, జూన్ 16: ఉద్యోగులకు సంబంధించిన సమస్యలను ప్రభుత్వం త్వరితగతిన పరిష్కరించాలని టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు, వ్యవసాయ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వైద్యనాథ్ పేర్కొన్నారు. ఆదివారం నాంపల్లిలోని టీఎన్జీవో భవన్‌లో ఏలూరి శ్రీనివాసరావు అధ్యక్షతన సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కరించడంతోపాటు బదిలీల ప్రక్రియ చేపట్టాలని, 317జీవో సంబంధిత సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అన్ని శాఖల్లో ప్రమోషన్ ప్రక్రియలు చేపట్టి, వ్యవసాయ అధికారులకు వాహన సదుపాయం కల్పించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంగారెడ్డి టీఎన్జీవో కార్యదర్శి ఏవీజీకే ప్రసాద్, కోశాధికారి డాక్టర్ సంతోష్ కుమార్, ఉపాధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## 'కులం పేరుతో దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి'

నర్సాపూర్, జూన్ 16: నర్సాపూర్ మండలం మహ్మదాబాద్ గ్రామంలో దళితులను అదే గ్రామానికి చెందిన కొందరు కులం పేరుతో దూషించి దాడి చేసిన వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవానలి సీపీఎం డివిజన్ కార్యదర్శి నాగరాజు డిమాండు చేశారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మహ్మదాబాద్ గ్రామంలోని దళిత వర్గానికి చెందిన పెంటయ్య, కృష్ణలపై అదే గ్రామానికి చెందిన కొందరు స్థలం విషయంలో గొడవ పడి కులంపేరుతో దూషించి దాడి చేసి కొట్టారని వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని పోలీసులకు లిఖితపూర్వకంగా కూడా కోరినట్లు చెప్పారు.

## అక్రమంగా గోవులను తరలిస్తే తీవ్ర పరిణామాలు

చిన్నశంకరంపేట, జూన్ 16: అక్రమంగా గోవులను తరలిస్తే తీవ్రపరిణామాలు తప్పవని బీజేపీ మండలాధ్యక్షుడు పోగుల రాజు హెచ్చరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆదివారం సూరారం చౌరస్తాలో ఆటోలో తరలిస్తున్న గోవులను బజరంగ్‌దళ్, బీజేపీ నాయకులు పట్టుకుని పీఎస్‌కు తరలించినట్లు వారు తెలిపారు. కార్యక్రమంలో రాచర్ల అశోక్, దశరథం, ఆకుల రాజు, మేడి శ్రీను, మధు, బాబు, సంజీవరెడ్డి పాల్గొన్నారు.

## గోరక్షకులను అరెస్టు చేయడం సరికాదు



బీజేపీ కార్యాలయంలో మాట్లాడుతున్న బీజేపీ మండల నాయకులు

పెద్దశంకరంపేట, జూన్ 16: గోవులను సంరక్షించాలని కోరుతూ నిన్న మెదక్ పట్టణంలో జరిగిన సంఘటనకు సంఘీభావం ప్రకటించిన మెదక్‌జిల్లా బీజేపీ అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్, మెదక్ పట్టణ అధ్యక్షుడు ప్రసాద్‌తో పాటు పలువురు బీజేపీ నాయకులను, గో సంరక్షకులను పోలీసులు అరెస్టు చేయడం సరికాదని మండల బీజేపీ అధ్యక్షుడు కోణం విఠల్ పేర్కొన్నారు. ఆదివారం పెద్దశంకరంపేటలోని బీజేపీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ గోవులను సంరక్షించాలని హైకోర్టు ప్రభుత్వానికి ఉత్తర్వులు ఇచ్చినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించడం మంచిది కాదన్నారు. నిన్న మెదక్‌లో జరిగిన ఘటనలో పోలీసులు మాత్రం బీజేపీ నాయకులను, గో సంరక్షకులను అర్ధరాత్రి అరెస్టు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం, పోలీసులు పాటించాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో మండల బీజేపీ నాయకులు, మాజీ సర్పంచులు సూర్యప్రకాష్, అశోక్, శ్రావణ్‌కుమార్, మంగలి కృష్ణ, ఎర్ర శ్రీహరి, తదితరులుపాల్గొన్నారు.

## మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలి



ఖేడ్‌లో ఏర్పాటు చేసిన మాదిగ జనసభలో మాట్లాడుతున్న మాదిగ జేఏసీ వ్యవస్థాపకుడు డాక్టర్ పిడమర్తి రవి

నారాయణఖేడ్, జూన్ 16: జనాభా, దామాశ ప్రకారం మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలని మాదిగ జేఏసీ వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ పిడమర్తి రవి డిమాండ్ చేశారు. ఆదివారం నారాయణఖేడ్‌లో ఏర్పాటు చేసిన నియోజకవర్గస్థాయి మాదిగ జనసభలో ఆయన మాట్లాడుతూ.. మాదిగలకు 12 శాతం రిజర్వేషన్ కల్పించాలనే డిమాండ్‌తో ఉమ్మడి జిల్లాలో నియోజకవర్గాల వారిగా జన సభలను నిర్వహిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఉన్న రిజర్వేషన్లలో భాగంగా 7 శాతం మాత్రమే రిజర్వేషన్ కల్పిస్తున్నందున, మాదిగలకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. జనాభా దామాశ ప్రకారం 12 శాతం రిజర్వేషన్ కల్పించే బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనన్నారు. ఉమ్మడి మెదక్ జిల్లాలో మాదిగలు అత్యధికంగా ఉన్నందున రిజర్వేషన్ పెంపుతో వారి అభివృద్ధికి ఆస్కారం ఏర్పడుతుందన్నారు. సమావేశంలో ఖేడ్ నియోజకవర్గ ఇన్‌చార్జి పగిడిపల్లి రమేష్, మాదిగ జేఏసీ జిల్లా అధ్యక్షుడు రవికిరణ్, నాయకులు మనోహర్, అలిగే జీవన్, ప్రసాద్, ఏసుదాస్, యూత్ నాయకులు సుకుమార్, తుకారం, దుర్గయ్య, తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్‌లో చేరిన సోలక్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్



కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిన పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి తదితరులు

జిన్నారం, జూన్ 16: సోలక్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఆదివారం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కాటా శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌కు చెందిన సోలక్‌పల్లి పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, నాయకులు ప్రభాకర్‌గౌడ్ కాంగ్రెస్‌లో చేరారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వపాలన పట్ల ప్రజలలో సానుకూలత నెలకొనడంతో ఇతర పార్టీల నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలో చేరుతున్నారని కాటా శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.